క్లుప్తంగా

హోలియా దాసరులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మరికల్: ఆర్థికంగా బలహీనంగా ఉన్న హోలియా దాసరులకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారా కొండయ్య గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హోలియా దాసరులకు ఇళ్ల స్థలాలు లేక గ్రామ శివారులో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని గుర్తు చేశారు. ఏన్నో ఏళ్ల నుంచి సొంత ఇళ్లు లేక గ్రామాలకు దూరంగా ఉంటున్నా ప్రభుత్వం తమను గుర్తించడం లేదని వాపోయారు. ఈ విషయంపై పలు మార్లు రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలను ఇచ్చిన స్పందన లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే హోలియా దాసరులకు స్థలాలను పంపిణీ చేసిన ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్రీడా పోటీలు



దామరగిద్ద: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు స్థానిక ఏఎస్ఐ అరోన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు సర్కిల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ వెంకటప్ప, నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జెండావిష్కరణ

కృష్ణా: మండల పరిషత్ కార్యాలయం ఎదుట రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండావిష్కరణ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ పూర్ణిమ పాటిల్ హాజరవుతున్నట్లు వివరించారు.

ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

ధన్వాడ: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సద్గుణ తెలిపారు. ఉదయం 8.45గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో, 9 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ ఉంటుందని, కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగం అనర్థాలపై ర్యాలీ



జడ్చర్ల టౌన్: ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేలా స్థానిక బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ వల్ల కలిగే కష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డా.అప్పియా చిన్నమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ యాదయ్య, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కుల వృత్తులకు పెద్దపీట



మదనాపురం: బీఆర్ఎస్ ప్రభుత్వం కులవృత్తులకు పెద్ద పీట వేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిట్టి యాదగిరి అన్నారు. గురువారం మండలంలోని నర్సింగాపురంలో గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ మొదటి విడత విజయవంతమైందన్నారు. జూన్ 5వ తేదీన రెండో విడత ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ కులం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్‌తో పాటు రూ.34,750 డీడీ చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని కాపరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు బాలరాజుయాదవ్, బండి యాదగిరి, రాములు, వెంకటేష్, సురేష్, బాలీశ్వరయ్య, ఆంజనేయులు, బాలస్వామి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ జామ్ పరీక్షలో పీయూ విద్యార్థి ప్రతిభ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి విస్లావత్ ప్రేమ్ జాతీయ స్థాయిలో నిర్వహించే ఐఐటీ జామ్ పరీక్షలో సత్తా చాటి ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీకి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు అభినందించారు. హెచ్‌ఓడీ చంద్రకిరణ్, అధ్యాపకులు శ్రీధర్, రామ్మోహన్, ఆమేషా ఆస్మీ, రవికుమార్, సిద్ధరామయ్య ఉన్నారు.

భూసారంపై శ్రద్ధ ఏదీ?

- వరికోతల అనంతరం కొయ్యలు, వరిగడ్డిని దహనం చేస్తున్న రైతులు
- అవగాహన కల్పిస్తున్నా.. చేపట్టని చర్యలు



అడవిసత్యారం శివారులో వరి కొయ్యలకు నిప్పపెట్టిన రైతులు

మాగనూర్: కొన్నేళ్ల కిందట వరి కోతల అనంతరం గడ్డిని కుప్పలుగా వేసి పశువులకు మేతకు ఉపయోగించేవారు. ప్రస్తుతం కూలీల కొరత ఉండటంతో రైతులు కోతలకు యంత్రాలను ఉపయోగిస్తున్నారు. అనంతరం పొలంలో మిగిలిన కొయ్యలతో పాటు గడ్డికి నిప్పంటిస్తున్నారు. అవగాహన లోపంతో అన్నదాతలు ఇలా చేస్తుండటంతో భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

వానపాములు నశించే ప్రమాదం..

ఇలా చేయడంతో పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాదని చెబుతున్నారు. పంటలకు కీడు చేసే పురుగులను తినే వానపాములు, కీటకాలు నశించే ప్రమాదం ఉందని చెబుతున్నారు. భూమిలోని అవశేషాలు, ఖనిజ లవణాలు నశిస్తాయంటున్నారు.

గడ్డికి నిప్పంటిస్తే..

వరి పొలంలో గడ్డికి నిప్పంటిస్తే ఆ భూమిలో ఒక సెంటిమీటర్ లోతు వరకు భూమి పైపొరలో మట్టి 33.8 నుంచి 42.2 డిగ్రీల సెల్సీయస్ ఉష్ణోగ్రతకు గురవుతుంది. అత్యంత కీలకమైన జీవరాసులు, శిలీంద్రాల సంతతి నశించిపోతుందని, భూమి సేంద్రియ లక్షణం నాశనమవుతుంది. భూమి పైపొరలో మేలు చేసే మిత్ర పురుగులు నశించడంతో పంటలపై పురుగుల దాడి పెరిగిపోతుంది. టన్నుల పంట వ్యర్థం తగులబెట్టినప్పుడు మట్టిలో సేంద్రియ కార్బనంతో పాటు (5.5 కిలోల నత్రజని, 2.3 కిలోలకు పైగా ఫాస్పరస్, 25 కిలోల పొటాషీయం, కిలోకు పైగా గంధకం) 33.8 పోషకాలు నాశనమవుతాయి.

ఇలా చేస్తే మేలు..

- పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.
- పంటల కోత పూర్తయిన తరువాత మిగిలిన పంటల అవశేషాలను భూమిలో మురుగబెట్టి దుక్కిలో కలిపి దున్నాలి. ఇలా చేయడంతో వరిగడ్డి భూమిలో మురిగి సేంద్రయ ఎరువుగా మారుతుంది.
- మిగిలిన వరి కొయ్యలు, వరిగడ్డిలోనే యూరియా, పాస్ఫేట్‌లను కలిసి వేస్తే వారంలోనే మురుగుతాయి.

భూసారం తగ్గుతుందని తెలియదు..



పంటకోత యంత్రాలు అందుబాటులో వచ్చినప్పటి నుంచి మిగిలిన కొయ్యలను, గడ్డిని తగల బెడుతున్నాం. ఇలా చేస్తే భూసారం తగ్గుతుందని తెలియదు. దీనిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

– శివప్ప, రైతు కోల్పూర్

సమయం ఆదాకోసం..

ప్రస్తుత కాలంలో రైతులకు గడ్డిని పోగేసి, కొయ్యలను మురుగబెటేంత సమయం లేకుండా పోయింది. కూలీల సమస్య కూడా తీవ్రంగా ఉండటంతో సమయం ఆదా కోసం తగ్గులబెటడం కోసం ఇలా చేయడం తప్పడం లేదు.

– కిష్టప్ప, రైతు వడ్వాట్

చర్యలు తీసుకుంటాం..



పంట భూముల్లో గడ్డి, వరి కొయ్యలను దహనం చేస్తే భుసారాన్ని కోల్పోతోంది. అవసరం లేని గడ్డిని భూమిలోనే కలిపి దున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూమికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. గడ్డి , కొయ్యల దహనంతో వాతావరణం కాలుష్యం అవుతుంది, ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

– సుదర్శన్‌గౌడ్, ఇన్‌చార్జ్ ఏఓ మాగనూర్

క్రీడారంగాల్లో రాణిస్తే భవిష్యత్



మక్తల్‌లో క్రీడలు ప్రారంభిస్తున్న మక్తల్ సీఐ సీతయ్య

మక్తల్: క్రీడా రంగాల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా అథ్లెటిక్స్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. గురువారం మక్తల్‌లో ఎంసీఎల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో పాల్గొని ప్రారంభించారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం, తల్లి దండ్రుల దినోత్సవం సందర్భంగా మక్తల్‌లో క్రీడలను మక్తల్ సీఐ సీతయ్య ప్రారంభించారు. మక్తల్‌లో భారీగా ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల సందర్భంగా క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో మక్తల్ ఎస్ఐ పర్వతాలు, శాంతి, గోపాలం, రమేష్‌కుమార్, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: దశాబ్ది ఉత్సవాలను ఊరూరా వైభవంగా నిర్వహించాలని మండల పదాధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులకు ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ నాయకుల కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 22 వరకు గ్రామాల్లో ఉత్సవాలు ముగిసే వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాలకు సంబంధించి ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యేలా ప్రజాప్రతినిధులు వివరించాలని సూచించారు. మహిళలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ భీమయ్యగౌడ్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు

మాగనూర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాల స్వరాష్ట్ర స్వప్నం సాకారమై పది సంవత్సరాలు కావడంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకొంటున్నామని వివరించారు.

ఆలయ ముఖద్వారానికి భూమిపూజ



కురుమూర్తిస్వామి ముఖద్వారానికి భూమిపూజ చేస్తున్న దాతలు

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో కురుమూర్తి స్వామి ఆలయ ముఖద్వారాన్ని గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ దంపతులు సొంత ఖర్చులతో నిర్మించేందుకు గురువారం వేదపండితులు వెంకటేశ్వర చార్యులు ప్రత్యేక పూజ చేసిన అనంతరం భూమిపూజ చేశారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అలంకణోత్సవం కార్యక్రమం అత్యంత కనుల పండగ జరుగుతుంది. స్వామి ఆభరణాలను దుప్పల్లి మీదుగా కురుమూర్తి గిరులకు తరలిస్తారు. ఆభరణాలకు పెద్ద ఎత్తున స్వాగతం పలికి గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. స్వాగతం పలికే స్థలంలో ముఖద్వారం నిర్మించేందుకు దాతలు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో సర్పంచు శివ, వెంకటేశ్వర రెడ్డి, తిర్మల్‌రెడ్డి, మహిందర్‌రెడ్డి, బత్తుల నరసింహ, నర్సిరెడ్డి, భరత్‌కుమార్, భరత్‌రెడ్డి, అనంత రాములు గౌడ్, వడ్ల సత్యన్న, మహిందర్, రామదాస్‌గౌడ్, గొల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గంలో నడవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: క్రీస్తు మార్గంలో నడిస్తే జీవితాలు మారుతాయని జంగారెడ్డిగూడెంకు చెందిన పాస్టర్ ఏఆర్.పాల్‌సన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నుంచి జీసస్ పవర్ అపోస్థలిక్ మినిస్ట్రీస్ దాసరి సోదరుల ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ రీట్రీట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాస్టర్ క్రీస్తు సందేశం ఇచ్చారు. చిన్నారులు దైవమార్గాన్ని అనుసరిస్తే సమాజంలో మంచి పౌరులుగా, సమాజానికి మంచి చేసేవారిగా నిలబడుతారని అన్నారు. అనంతరం గుంటూర్‌కు చెందిన పాస్టర్ సాదు సుందర్ సింగ్, రాజమండ్రికి చెందిన జాన్‌సన్ సందేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా బైబిల్ కథలు, దేవుని పాటలు, మ్యాజిక్‌షో, చిన్నారులకు బైబిల్ క్విజ్, కంఠతా వ్యాఖ్యలు, పప్పెట్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాబర్ట్‌వెస్లీ బృందం ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలపించారు. శుక్రవారం నుంచి రెండు రోజులపాటు ఆశీర్వాద కూడిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ పాస్టర్లు డానియల్ సుధీర్, పరియన్, నిర్వాహకులు దాసరి సుందర్, దాసరి ప్రసాద్, దాసరి సామ్యేల్, కిరణ్, ప్రభాకర్, బెంజెమెన్, మెలిక్సెదెక్, గుర్రం అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఆర్ పాల్‌సన్

మోసం చేసిన యువకుడిపై ఫిర్యాదు

మక్తల్: వివాహితను పెళ్లి చేసుంటానని రెండు సంవత్సరాల నుంచి ప్రేమిస్తూ.. మోసం చేసిన యువకుడిపై గురువారం మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ మండలం గుడిగండ్లకి చెందిన నరేష్ అదే గ్రామానికి చెదిన వివాహితతో రెండు సంవత్సరాల నుంచి ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేశాడని వివాహిత మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పర్వతాలు తెలియజేశారు.

వేసవి శిబిరం తనిఖీ



ఊట్కూరు: మండల పరిధిలోని ఓబులాపూర్ పాఠశాలలో కొనసాగుతున్న వేసవి శిబిరాన్ని గురువారం ఎంఈఓ వెంకటయ్య తనిఖీ చేశారు. ఆంగ్లం , గణితం పై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వేసవి శిబిరంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడంపై ఉపాధ్యాయులను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు గురునాథ్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' విజయవంతం చేద్దాం



ఊట్కూరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని సర్పంచ్ రవికుమార్ కోరారు. మండలంలోని పెద్దపొర్లలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. కంటి సంబంధ సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ శివప్ప, వైద్య సిబ్బంది సురేష్, దేవికారాణి తదితరులు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా ముందుకు..



ఆత్మకూర్: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నాయకులు, కార్యకర్తలు అధికారమే లక్ష్యంగా ముదుకెళ్లాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలో మహాజన సంపర్క్ యోజన కార్యాక్రమంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన మంత్రి మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని, బీఆర్ఎస్ వైఫల్యాలను గడపగడపకు తీసుకెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగలింగేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, చందు, సమద్ తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల పరిశీలన

నారాయణపేట: జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న కలెక్టరేట్ సమీకృత భవనాన్ని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్‌తో కలిసి కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. సింగారం గేటు సమీపంలో 23 ఎకరాల్లో నిర్మిస్తున్న కలెక్టరేట్ భవన పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని కూలీలను పెంచి త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కలెక్టర్‌తో పాటు ఆర్ అండ్‌బీ అధికారి రాములు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఉపాధి హామీ కూలీలకు న్యాయం చేయాలి



జాజాపూర్‌లో మాట్లాడుతున్న ప్రశాంత్

నారాయణపేట రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల శ్రమ దోపిడిని అరికట్టి వారికి తగిన న్యాయం చేయాలని ఏఐపీకేఎంఎస్ నాయకులు ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని జాజాపూర్‌లో జరుగుతున్న ఉపాధి పనుల ప్రదేశాన్ని గురువారం సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. పెండింగ్ వేతనాలు అందించి, మేటీలకు పారితోషికం ఇవ్వాలని కోరారు. ఇన్సురెన్స్, సేఫ్టి కిట్, పనిముట్లు, కనీస సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు. గతంలో 82 రకాల పనులు చేయిస్తుండగా వాటిని కుదించి 22 రకాల పనులు మాత్రమే అనుమతులు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఉపాధి హామీ కూలీల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహులు, అనిల్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

పని దినాలు పెంచాలి..

మరికల్: జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల పని దినాలను పెంచాలని సీపీఐ జిల్లా నాయకుడు రాము అన్నారు. మండలంలోని పూసల్‌పహాడ్‌లో గురువారం ఆయన ఉపాధి పనుల వద్ద కూలీలతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న వంద రోజుల పనిదినాలను 200 రోజులకు పెంచాలని, అలాగే పని తగ్గ కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. చేసిన పనులకు వారం, వారం డబ్బులను కూలీల బ్యాంకు ఖాతాలో జమ చేయాలని కోరారు. అలా కాకుండా అధికారులు కూలీలతో వెట్టి చాకిరి చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో శివాజీ, లక్ష్మి, రాజేశ్వరి, కౌసల్య, మంజుల, పావని పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

నారాయణపేట రూరల్: ఇటీవల విడుదలయిన టెన్త్ ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన కోటకొండ జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.వీణను గురువారం ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, పేద, మధ్య తరగతి చిన్నారులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు పోతుందన్నారు. ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్స్‌తో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో చారిత్రక విజయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేపూరిరాములు, డీలర్ సుధాకర్ పాల్గొన్నారు.



వీణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



కోటకొండలో దీక్ష ప్రారంభిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో చేస్తున్న నిరసన దీక్షలు గురువారం కొనసాగాయి. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు దీక్షలో కూర్చోగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ పూలమాలలు వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే కోటకొండ గ్రామస్తులు అన్ని అర్హతలు ఉన్న తమ గ్రామాన్ని మండలం చేయాలని ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని విమర్శించారు. అర్హత లేని అనేక గ్రామాలను మండలాలుగా చేసిన కేసీఆర్ కేవలం రాజకీయ లబ్ధి కోసమే కోటకొండపై వివక్ష చూయిస్తున్నారని వాపోయారు. విద్యారంగంలో అభివృద్ధి చెందాలంటే వెంటనే కోటకొండ వంటి వెనకబడిన ప్రాంతాన్ని మండలంగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ అనసూయ, నాయకులు బి.రాము, కెంచె శ్రీనివాసులు, కాశీనాథ్, రాజు, ప్రవీణ్, చెన్నప్పయాదవ్, నర్సింహులు, భీమేష్, కిష్టప్ప, ఆశప్ప, సాయిలు, అంజి పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టాలి

ఊట్కూరు: కొత్త ఓటర్ల నమోదు కోసం బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టాలని తహసీల్దార్ ఎస్ తిరుపతయ్య కోరారు. తమ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 01, 2023 నాటికి 18 ఏళ్ల నిండే యువతి యువకులను కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. రోజు 20 ఇళ్లలో సర్వే పూర్తి చేయాలని అర్హులైన వారు ఉంటే కొత్త ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు, ఎవరైనా మృతి చెంది ఉంటే పేర్లను తొలగించాలని అన్నారు. ఇంటి నెంబర్, పేర్లు తప్పుగా ఉన్నా సరి చేయాలన్నారు. ఆర్ఐ రాఘవేందర్‌రెడ్డి, వీఆర్ఏలు భీంరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్

గురుకుల పాఠశాలకు ఎంపిక

మక్తల్: మండలంలోని మాద్వార్‌కి చెందిన జ్యోతి మాద్వార్‌లో చదువుతోంది. విద్యార్థి జ్యోతి సంగం బండలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలకు ఎంపికైందని హెచ్ఎం నర్సిరెడ్డి తెలిపారు. అదేవిధంగా మక్తల్‌లో ఎస్సీవాడ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థి అంకితకు నర్వ బాలికల గురుకుల పాఠశాల యల్లమ్మకుంటకు ఎంపికైందని ఉపాధ్యాయులు తెలిపారు. ర్యాంకు రావడంపై గురుకుల పాఠశాల ఎంపిక కావడంపై విద్యార్థులను అభినందించారు. అనిల్‌గౌడ్, గోపాల్, రవీందర్, శ్రీనివాస్‌రావు, వనజ, బాబు అబినందించారు.



జ్యోతి



అంకిత

కార్మికులకు వైద్య పరీక్షలు

నారాయణపేట రూరల్: మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో గురువారం లేబర్‌కార్డు కలిగిన ప్రతి కార్మికుడికి ఉచితంగా వైద్య పరీక్షలను చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభావతి మాట్లాడుతూ.. కార్మికులకు దాదాపు 50 రకాలైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్మికులు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని, కుటుంబ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దాదాపు రూ.15వేల నుంచి రూ.20వేలకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా లభిస్తున్నాయని చెప్పారు. గ్రామంలో 70మంది కార్మికులకు హెల్త్ చెకప్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ అబ్దుల్ నయీం, ఐఎఫ్‌టీయూ నాయకులు నర్సింహ, ప్రశాంత్, రాములు, బాలు, కతలప్ప, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.



కార్మికులకు హెల్త్ చెకప్ కార్డును అందిస్తున్న సర్పంచ్

రోడ్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోండి

కోయిల్‌కొండ: మండలంలోని మల్కాపూర్‌రోడ్డు నుంచి వర్ధన్నపల్లితండా వరకు వేసినరోడ్డును కొందరు తండా వాసులు తమ స్వార్థం కోసం జేసీబితో తొలగించారని గురువారం రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదట ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ నక్షలో ఉన్న రోడ్డును తొలగించడం అన్యాయమని తమకు న్యాయం చేయాలని వారు తహసీల్దార్ ప్రేమ్‌రాజ్‌ను కోరారు. మూడు సంవత్సరాల క్రితమే సర్వే చేయించి రోడ్డును వేసుకున్నట్లు వివరించారు. అంతకుముందు తహసీల్దార్ ప్రేమ్‌రాజ్, ఎస్ఐ సతీష్ రోడ్డు తొలగింపును పరిశీలించారు. రోడ్డు తొలగింపును ఆపాలని తండా కోరగా ఇరువర్గాల రైతులు కూర్చొని మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పి వెళ్లిపోయారు. అయినా వినకుండా కొందరు మళ్లీ రోడ్డును తొలగిస్తుంటే రైతులు తహసీల్దార్‌తో మొర పెట్టుకున్నారు. దీంతో ఆయన సర్పంచ్ నారాయణతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించుకోవాలని కోరారు. నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భీమన్న, నారాయణ, నాగన్న, గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.